క్లుప్తంగా

ఘనంగా అయ్యప్పస్వామి జన్మదినం



అయ్యప్పస్వామి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

దెంకాడ: మండలంలోని పినతాడివాడలో అయ్యప్పస్వామి జన్మదినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం అయ్యప్పస్వామి విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు కళాశాలతో అధిక సంఖ్యలో పాల్గొనడంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

రోగులకు సకాలంలో వైద్యసేవలు

- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ అప్పలనాయుడు



ఆరోగ్యశ్రీ విభాగంలో కేస్‌షీట్‌లను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ సంబంగి అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని సందర్శించి పలు వార్డులు, ఓపీ విభాగాలు, లేబరేటరీ, అల్ట్రా సౌండ్ స్కాన్, ఎంఆర్ఐ, సిటీ స్కాన్, ఫార్మసీ, క్యాజువాలిటీ, ఐసీయూ విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో చేరిన వెంటనే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయాలని ఆదేశించారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్..



చిన్నారుల తల్లులకు అవగాహకల్పిస్తు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతిలత

భోగాపురం: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, అలాగే రక్తహీనతకు చెక్ పెట్టవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతిలత అన్నారు. శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలను వివరించారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టాలన్నారు. పిల్లలకు వెయ్యి రోజుల సంరక్షణలో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సత్యవతి, ఏఎన్ఎం పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు రమణమ్మ, తులసి, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి..



మున్సిపల్ కమిషనర్ నల్లనయ్యకు వినతిపత్రం ఇస్తున్న నటి కల్యాణి

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలోని పూల్‌బాగ్ కాలనీలో ఉన్న రోడ్లను ఆక్రమించడంతో పాటు ప్రశ్నించేవారిపై అట్రాసిటీ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్న అశోక్ అనే వ్యక్తిపై చర్యలు చేపట్టాలని ప్రముఖ నటి పడాల కళ్యాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పల్లి నల్లనయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పూల్‌బాగ్‌కాలనీలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమణలకు పాల్పడ్డారని ఆరోపించారు. కాలనీ కాలువపై నిర్మాణాలు చేపట్టారని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. తగిన చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దెంకాడ: మండలంలోని రాజాపులోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శనివారం ఉదయం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల విభజన పనులు చేపట్టనున్న నేపథ్యంలో మండలంలోని మోపాడ, జగన్నాథపురం గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆన్‌లైన్‌లో పీఏసీఎస్ కార్యకలాపాలు..

- కంప్యూటరీకరణ పూర్తి
- మరింత బలోపేతంగా పీఏసీఎస్‌లు
- రైతులకు అందనున్న డిజిటల్ సేవలు



పూసపాటిరేగ డీసీసీబీ బ్రాంచ్

పీఏసీఎస్‌లు	రైతుల సంఖ్య
పూసపాటిరేగ	1350
వెంపడాం	909
కుమిలి	1050
లంకలపల్లిపాలెం	980

పూసపాటిరేగ: అన్నదాతలకు ఆర్థిక తోడ్పాటు అందించడంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పాత్ర కీలకం. అంతటి ప్రాధాన్యత కలిగిన సహకార సంఘాలను బలోపేతం చేసి సేవలను మరింత సులభతరం చేయడానికి కేంద్ర సహకార మంత్రిత్వశాఖ చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా కార్యాలయాల్లో కంప్యూటరీకరణ పూర్తి చేశారు. దీంతో బినామీల పేరు మీద, తప్పుడు పత్రాలతో రుణాలు తీసుకోవడం వంటి పొరపాట్లకు ఇకపై చెక్ పడనుంది. పూసపాటిరేగ బ్రాంచ్ పరిధిలో సుమారు 15 వేల మంది రైతుల వివరాలను కంప్యూటరీకరణ చేశారు. దీని వల్ల రైతులకు మరింత మెరుగైన సేవలు అందించనున్నారు. పీఏసీఎస్‌లను నాబార్డు సాఫ్ట్‌వేర్ ద్వారా డీసీసీబీలకు అనుసంధానం చేసే విధంగా కేంద్ర సహకార మంత్రిత్వశాఖ చర్యలు చేపట్టింది. సొసైటీలలో నమోదైన ప్రతి ఖాతాదారుడికీ కంప్యూటరైజ్డ్ పాస్‌పుస్తకం జారీ అవుతుంది. దీంతో డేటాలో తప్పులు జరిగే అవకాశం ఉండదు. రైతు తీసుకున్న రుణం, చెల్లిస్తున్న సొమ్ము, వడ్డీ వివరాలను ఖాతాదారులు సులువుగా తెలుసుకోవచ్చును. ప్రతి ఖాతానూ ఆధార్‌తో అనుసంధానం చేస్తారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి వచ్చిన రాయితీలు రైతుల ఖాతాకు నేరుగా జమవుతాయి. జాతీయ బ్యాంక్‌ల మాదిరి పీఏసీఎస్‌లలో రైతులు లావాదేవీలు చేసుకోవచ్చును.

సేవలు సులువు..

పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు మరింత సులువుగా సేవలు అందనున్నాయి. కంప్యూటరీకరణ జరగడం వల్ల వడ్డీ, చెల్లింపులు, ఖాతా వివరాలు సులువుగా తెలుసుకోవచ్చు. గతంలో మాన్యువల్‌గా ఉండడంతో ఇబ్బంది పడేవారం. డిజిటల్ చేయడంతో నాణ్యమైన, కచ్చితమైన సేవలు అందుతాయి.

– ఎం.జయరాం, రైతు, పూసపాటిరేగ

పారదర్శకంగా..

రైతులకు మరింత పారదర్శకంగా సేవలు అందుతాయి. మొత్తం అన్ని వివరాలనూ కంప్యూటరీకరణ చేశాం. ఎటువంటి పొరపాట్లు జరిగినా సులువుగా అధిగమించవచ్చు. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ద్వారా సహకార సంఘాలు బ్యాంక్‌లుగామారాయి. ఇప్పటికే డిజిటల్ సేవలు ప్రారంభమయ్యాయి.

– పి. సాయిలత, డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్, పూసపాటిరేగ

• మజ్జిగ చలివేంద్రం ప్రారంభం..



విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొత్త గవరవీధి రామ మందిరం వద్ద విజయనగరం వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. శిబిరాన్ని ప్రారంభించిన ప్రముఖ సాహితీవేత్త కట్టమూరి చంద్రశేఖరం మాట్లాడుతూ... వేసవిలో మజ్జిగ పంపిణీ చేయడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కుప్పురావు, కార్యదర్శి టి. సత్యమూర్తి, కార్యనిర్వాహక సభ్యులు పీవీ రామారావు, వై. వీర్రాజు, బసవమూర్తి, సోషల్ వర్కర్ బి. గోపాలం, ఎం. నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన వైస్ చాన్సలర్ ప్రశాంత కుమార్ మహంతి

నెల్లిమర్ల/రూరల్: రక్తదానం ఓ మనిషి జీవితాన్ని కాపాడుతుందని సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి అన్నారు. యూనివర్సిటీ ఆవరణలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ.. రక్తదానం చేసే ముందు ఐరన్ ఎక్కువగా ఉన్న ఫుడ్ తీసుకోవడం చాలా మంచిదన్నారు. అలాగే రక్తదానం చేయడంపై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ వర్మ, డీన్ డాక్టర్ సన్నీడయాల్, శ్రావణి, జోగినాయుడు, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ సతీష్, ప్రభుత్వ వైద్యుడు షేక్ అహ్మద్, ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ కౌన్సిలర్ అప్పలనాయుడు, పలువురు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలంలో సర్వే

సాక్షి ఎఫెక్ట్



ఆక్రమణ భూములపై సర్వే చేపడుతున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

విజయనగరం: జిల్లా కేంద్రంలో విలువైన ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ఎట్టకేలకు అధికారులు స్పందించారు. కేఎల్ పురం ప్రాంతంలోని సర్వే నంబర్ 165/45 లో 27 సెంట్ల ప్రభుత్వ పోరంబోకు భూమి ఆక్రమణకు గురైందంటూ సాక్షి దినపత్రికలో 'ఆక్రమణ చెరలో ప్రభుత్వ భూమి' శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి కార్పొరేషన్ యంత్రాంగం స్పందించింది. కమిషనర్ నల్లనయ్య ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఐవీ రమణమూర్తి ఆధ్వర్యంలో టీపీఓ అప్పలరాజు, టౌన్ సర్వేయర్ సింహాచలం, తదితరులు ఆక్రమిత భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ రమణమూర్తి మాట్లాడుతూ.. సర్వే చేసిన తర్వాత కమిషనర్ ఆదేశాల ప్రకారం ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడం జరుగుతుందన్నారు. విచారణలో మండల రెవెన్యూ అధికారి, సచివాలయ సిబ్బంది, వార్డు కార్పొరేటర్ తాళ్లపూడి సంతోషి కుమారి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

దెంకాడ: మండలంలోని డెంకాడ గ్రామానికి చెందిన పలు కుటుంబాలు సమాజ్‌వాదీ పార్టీని వీడి బీజేపీలో శుక్రవారం చేరారు. నెల్లిమర్ల నియోజకవర్గ సమాజ్‌వాదీ పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన కర్రి కృష్ణతో పాటు పలువురు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గ కన్వీనర్ బూర్లె శ్రీధర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీఈఓ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

- పీఏసీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కామేశ్వరరావు



ధర్నాచేస్తున్న విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఆంధ్రప్రదేశ్ పీఏసీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు

విజయనగరం గంటస్తంభం: ఉద్యోగులపై సీఈఓ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి పీఏసీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.కామేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో 2019 నుంచి పని చేస్తున్న సిబ్బందిపై ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరుతూ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఆంధ్రప్రదేశ్ పీఏసీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యారావు, రామునాయుడు ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ వద్ద శుక్రవారం భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం సీఈఓ ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన సీఈఓ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ.. 2019 నుంచి సంఘంలో పనిచేస్తున్న సిబ్బందిపై సీఈఓ తప్పుడు ఉద్దేశంతో వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. గతంలో ఇచ్చిన కరువు భత్యంపై ఇచ్చిన సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. సంఘంలో సీఈఓలుగా పనిచేస్తూ డీసీసీబీ కోటాలో అర్హత సాధించిన వారికి తక్షణమే పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నారాయణరావు, ఏవీ సత్యనారాయణ, గిరిబాబు, ఆర్‌వీజే నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ రంగ సమస్యలు పరిష్కరించాలి

- నేడు విశాఖలో సదస్సు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన ఉద్యోగులు

విజయనగరం గంటస్తంభం: ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ రంగ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జె.రాజశేఖర్ కోరారు. సమస్యల పరిష్కారం కోసం విశాఖపట్నం అల్లూరు విజ్ఞాన కేంద్రంలో శనివారం జరగనున్న సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022 పీఆర్సీ ఏరియర్స్ తక్షణమే ఇవ్వాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పెయిడ్ హాలిడేస్ చెల్లించాలని, వీడీఏలు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 10 సంవత్సరాల ఇన్సెంటివ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎ.జగన్‌మోహనరావు, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



విజయనగరం ఫోర్ట్: సుంకరివీధిలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: పౌష్టికాహారంతో ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గనివాడ ఎర్రయ్యమ్మ, అనురాధ అన్నారు. పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా సుంకరవీధి, అయ్యన్నపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి ఎన్ఆర్‌సీ (పౌష్టికాహార పునరావాస కేంద్రం)కి పంపించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే గాయత్రి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈశ్వరమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

పోషక విలువలతో కూడిన ఆహారం ఇవ్వాలి



పూసపాటిరేగ: పేరాపురంలో పోషణ పక్వాడ్‌పై ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పూసపాటిరేగ: చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారం ఇవ్వాలని భోగాపురం ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రాజేశ్వరి అన్నారు. మండలంలోని పేరాపురంలో 1000 రోజుల పోషణపక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన



డీఈఓ మాణిక్యంనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

విజయనగరం గంటస్తంభం: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు జనవరి నుంచి బకాయి ఉన్న బిల్లులు, గౌరవ వేతనాలను తక్షణమే చెల్లించాలని పలువురు కోరారు. ఈ మేరకు ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు డీఈఓ యు. మాణిక్యంనాయుడును శుక్రవారం కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ. జగన్‌మోహనరావు, యూనియన్ నాయకురాలు టి. లక్ష్మి మాట్లాడుతూ.. నేటికి నాలుగు నెలలుగా బిల్లులు, జీతాలు చెల్లించకపోతే పిల్లలకు ఎలా వండి పెట్టాలని ప్రశ్నించారు. ఇప్పటికే కిరాణా షాపుల్లో బకాయిలు వేలల్లో పేరుకుపోయాయని చెప్పారు. 2024 అక్టోబర్‌లో కొత్త మెనూ ప్రకటించినప్పటికీ..నేటికీ పాత మెనూ ప్రకారమే బిల్లులు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన మెనూ చార్జీలను ఏరియర్స్‌తో సహా చెల్లించాలని, నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని, కనీసం పదివేల రూపాయల వేతనం ఇవ్వాలని, ఉచిత గ్యాస్ సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో స్వప్న, లక్ష్మి మంగ, నారాయణమ్మ, ధనలక్ష్మి, హేమ, తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయండి



విజయనగరం: కార్పొరేషన్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

- మున్సిపల్ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: దేశ ఆధునిక వైతాళికుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని.. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరం పునరంకితమవుదామని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ..

అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు పూలే చేసిన కృషి మరువరానిదన్నారు. 1873లో తన అనుచరులతో కలిసి దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులు కల్పించడానికి సత్యశోధక్ సమాజ్‌ను ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. అంతేకాకుండా 1848లో పూణేలో జ్యోతిరావు పూలే బాలికల కోసం తొలి పాఠశాలను ప్రారంభించి బాలికా విద్యకు అంకురార్పణ చేశారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, టీపీఆర్ఓ సింహాచలం, ఉద్యోగ సంఘ అధ్యక్షుడు నర్సింగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ ఆధ్వర్యంలో..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రౌతు భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అవనాపు లక్ష్మణరావు, గొంప అప్పలరాజు, వామనాచారి, శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయం..

నెల్లిమర్ల: జ్యోతిరావు పూలే అన్నివర్గాల ప్రజలకు ఆదర్శనీయులని నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ కె.అప్పలరాజు, చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు కొనియాడారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి కమిషనర్, చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో..

విజయనగరం టౌన్: జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధి టీవీ దుర్గారావు పిలుపునిచ్చారు. దళిత బహుజన సంఘాల నాయకులు కలెక్టరేట్ వద్దనున్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బంగారు రాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



నెల్లిమర్ల: పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ బంగారు సరోజిని, తదితరులు



విజయనగరం టౌన్: పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత బహుజన సంఘాల నాయకులు

ఓటర్ల దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

- నెల్లిమర్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూకరాజు



డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథరావుతో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి నూకరాజు

నెల్లిమర్ల: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని నెల్లిమర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూకరాజు ఆదేశించారు. ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్ జగన్నాథరావుతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫారం 6, 7, 8 దరఖాస్తులకు సంబంధించి ఆన్‌లైన్‌లోనూ, స్వయంగా బీఎల్‌ఓలకు అందచేసిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఈ విషయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలు తహసీల్దార్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సక్రమంగా పనిచేయని బీఎల్‌ఓలపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఏ గ్రామంలో అయినా ప్రజల అభ్యర్థన మేరకు పోలింగ్ కేంద్రం మార్పుఅవసరం అనుకుంటే సంబంధిత పోలింగ్ కేంద్రాల బీఎల్‌ఓ, వీఆర్‌ఓ, పంచాయతీ సెక్రటరీలు విచారణ చేసి నివేదికను తహసీల్దార్‌కు పంపించాలని, తహసీల్దార్ మరోసారి విచారించి ఫైనల్ నివేదికను తనకు పంపించాలని ఆదేశించారు.